ప్రజాశక్తి
శనివారం 5 అక్టోబర్ 2024 5 విజయనగరం



లంకాజోడులో దారుణం

పిల్లలకు విషమిచ్చి తానూ తాగిన తల్లి

చికిత్స పొందుతున్న చిన్నారులు

ప్రజాశక్తి - కురుపాం

మండలం లంకాజోడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం దారుణం చోటుచేసుకుంది. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు.. కుటుంబ కలహాలు కారణంగా బిడ్డిక రమ్య తన 6నెలల చిన్నారికి, 5ఏళ్ల కుమారునికి విషం పట్టి తాను కూడా తాగిన సంఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే స్పందించి వారిని భద్రగిరి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. రమ్య భర్త రమేష్ పార్వతీపురంలో పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

సర్వీస్ రహదారిపైనే వర్షపు నీరు

- పట్టించుకోని హైవే అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహన చోదకులు

సర్వీస్ రహదారిలో నిలిచిన వర్షపు నీరు

హైవే పైనుంచి సర్వీస్ రోడ్డుపైకి పడుతున్న వర్షపు నీరు

ప్రజాశక్తి - భోగాపురం

జిల్లాలో 16వ నంబరు జాతీయ రహదారిపై కాలువ వ్యవస్థ సక్రమంగా లేదు. దీంతో వర్షపు నీరు ఎటూ వెళ్లకపోవడంతో ప్రజలతో పాటు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత ఇబ్బంది పడుతున్నా జాతీయ రహదారి అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. అంతంత మాత్రంగానే పడిన వర్షానికి సర్వీస్ రహదారి నీళ్లతో నిండిపోతోంది. భోగాపురంలో ప్రజలు రాకపోకలు చేసేందుకు రెండు వంతెనలు ఉన్నాయి. ఈ రెండు వంతెనల మధ్యనున్న ప్రాంతం లోతట్టులో ఉండడంతో పైనున్న రహదారి పైనుంచి వచ్చే వర్షపు నీరు సర్వీస్ రహదారి పైకి పడుతుండడంతో ఈ సమస్య ఏర్పడింది. సర్వీస్ రహదారిలో కూడా వర్షపు నీరు కాలువల్లోకి సక్రమంగా వెళ్లకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు చెబుతున్నారు. కోత మిషను నుంచి పాత మీసేవ వరకు మధ్యలో ఉన్న గృహాల వారు ఈ వర్షం నీటిలో నుంచే రాకపోకలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులు నుంచి ఇబ్బంది పడుతున్నప్పటికీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని, సర్వీస్ రహదారిలో నీరు నిల్వ ఉండిపోవడంతో రాకపోకలు చేసే వాహనాలు వెళ్తున్నప్పుడు వర్షపు నీరు తుళ్ళిపడి ఇళ్లల్లోకి పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు

కోట జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన కోటజంక్షన్ వద్ద శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడం, రేట్లు పెరిగిపోవడం, విచ్చలవిడి అవినీతి వలన ప్రజల్లో తీవ్ర అసంతప్తి ఏర్పడిందన్నారు. అనేక కారణాలతో పాటు ఇసుక సమస్యపై ఆగ్రహంతో వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించారని తెలిపారు. ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, వందరోజుల పాలనలో చూస్తే ఇసుక విషయంలో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేకుండా పోయిందని అన్నారు. నేడు జిల్లాలో ఇసుక లభించక భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. మరోవైపు ఇసుక అక్రమ రవాణా జిల్లాలో కొనసాగుతోందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు పలుచోట్ల ఇసుకపై పెత్తనం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి పదేపదే బహిరంగంగా హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రాలేదన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేసుకునే చిన్న, పేద, మధ్య తరగతి వర్గాలు పై భారం పడుతున్నదన్నారు. ఇసుక ఆన్లైన్ విధానం ప్రవేశపెడుతున్నామని ప్రభుత్వం ప్రకటించిందని, ప్రభుత్వ ప్రకటనలకు, హామీలకు, ఆచరణకు పొంతనలేదన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా ఇసుక లభించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పాత ఇసుక రీచ్‌లను కొనసాగించాలని డిమాండ్ చేశారు .కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, అర్.ఆనంద్, కంది త్రినాధరావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిపిఒ వెంకటేశ్వరరావు

డిపిఒగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పంచాయతీ అధికారిగా టి.వెంకటేశ్వర్రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీకాకుళం జిల్లాలో డిపిఒగా పనిచేస్తూ, ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన ఇంతకుముందు ఇక్కడ జిల్లా పరిషత్ సిఇఒగా పనిచేసిన అనుభవం ఉంది. జిల్లాలో డిపిఒగా పనిచేస్తున్న శ్రీధర్‌రాజా శ్రీకాకుళం పంచాయతీ అధికారిగా బదిలీపై వెళ్లారు. జిల్లా పంచాయితీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్రావు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పారాది వంతెనకు మోక్షం

కాంక్రీటు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పారాది వంతెన పనులను శుక్రవారం ఎమ్మెల్యే బేబినాయన పునప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన, డైవర్షన్ రోడ్డుకు కలిపి ఇప్పుడు రూ.13.40 కోట్లతో నిర్మాణం పనులను ప్రారంభించామన్నారు. రెండు రాష్ట్రాలకు ప్రధాన మార్గంలో ఉన్న వంతెన సమస్య తీవ్రతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి వివరించినట్లు తెలిపారు. దీనికి ముఖ్యమంత్రి స్పందించారని తెలిపారు. తన తాత ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన బ్రిడ్జి స్థానంలో కొత్త వంతెన పనులు ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. వచ్చే ఏడాది వర్షాకాలంలోగా వంతెన నిర్మాణం పూర్తిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, రొంపిల్లి సర్పంచ్ బవిరెడ్డి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

కాంక్రీటు వేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్‌పి వకుల్ జిందాల్ శుక్రవారం జిల్లాపోలీసు కార్యాలయంలో వెల్ఫేర్‌డే నిర్వహించారు. సిబ్బంది నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సిబ్బంది ఒక్కొక్కరిని తన ఛాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. వినతులను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని ఎస్‌పి తెలిపారు.

మరణించిన పోలీసు కుటుంబానికి 'చేయూత'

జిల్లా పోలీసుశాఖలో పని చేసి, ఇటీవల మరణించిన హెడ్ కానిస్టేబులు కుటుంబానికి సిబ్బంది అంతా కలసి 'చేయూత' అందించారు. రేగిడి ఆమదాలవలస పోలీసు స్టేషనులో హెడ్ కానిస్టేబులుగా పని చేసిన పి.నారాయణరావు అనారోగ్య కారణాలతో ఆగస్టు 30న మరణించారు. వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు 'చేయూత'గా పోలీసు సిబ్బంది ప్రోగు చేసిన రూ.1,49,000 చెక్ ను ఆయన సతీమణి పి.పార్వతమ్మకు జిల్లా ఎస్‌పి వకుల్‌జిందాల్ అందజేశారు. కార్యక్రమంలో ఆఫీసు సూపరింటెండెంట్ ఎ.ఎస్.వి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

దుర్గామాత ఆలయంలో ఎస్‌పి పూజలు

దేవీ దండుమారమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకల్లో ఎస్‌పి వకుల్ జిందాల్, 5వ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, మహిళా పిఎస్ సిఐ ఈ.నర్సింహమూర్తి, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

అవసరాలకు తగినంత ఇసుక సిద్ధం

త్వరలో రెండు ఇసుక రీచ్‌లు ప్రారంభం ● చీపురుపల్లిలో స్టాక్ పాయింట్ ఏర్పాటు : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో నిర్మాణాలు నిరాఘాటంగా కొనసాగేందుకు వీలుగా తగినంత ఇసుక అందుబాటులో ఉందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఇది ఆరునెలల జిల్లా అవసరాలకు సరిపోతుందని చెప్పారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం శుక్రవారం తమ ఛాంబర్‌లో నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇసుక, జిల్లా అవసరాలు, స్టాక్ పాయింట్లు, డీసిల్టింగ్, కొత్త ఇసుక రీచ్‌లు, రవాణా ఏర్పాట్లు, నిఘా తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక రవాణాకు రిజిష్టర్ చేసుకున్న స్థానిక వాహనాలకు మాత్రమే అనుమతించాలని ఆదేశించారు. బుక్ చేసుకున్న ఇసుకకు సరిపడేంత వాహనాన్ని మాత్రమే తీసుకురావాలని, ఈ మేరకు యాప్‌లో మార్పులు చేయాలని సూచించారు. జిల్లాలో రానున్న ఆరు నెలల అవసరాలకు సరిపడేటంత ఇసుక అందుబాటులో ఉందని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

వంగర మండలం కొండచాకరాపల్లివద్ద లభ్యమయ్యే 75వేల మెట్రిక్ టన్నుల ఇసుకలో 45వేల మెట్రిక్ టన్నులను బొబ్బిలి స్టాక్ పాయింట్‌కు తరలించాలని ఆదేశించారు. మిగిలిన 30వేల టన్నుల ఇసుకను కొత్తగా ఏర్పాటు చేయనున్న చీపురుపల్లి స్టాక్ పాయింట్ వద్ద అందుబాటులో ఉంచాలని, వీలైనంత త్వరగా ఈ స్టాక్ పాయింట్‌ను ప్రారంభించాలని సూచించారు. తెర్లాం మండలం కుసుమూరు వద్ద సుమారు 17వేల టన్నులు, సంతకవిటి మండలం తమరాడ వద్ద 47,000 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, ఈ రెండు ఇసుక రీచ్‌లనుంచి తవ్వకాన్ని మొదలు పెట్టాలని ఆదేశించారు. రేగిడి ఆమదాలవలస మండలం పొర్లి వద్ద అందుబాటులో ఉన్న ఇసుక రీచ్‌పై సర్వే చేసి, ఇసుక తవ్వకానికి సిద్ధం చేయాలన్నారు. ఇసుక రీచ్‌లవద్ద సిసి కెమేరాలను ఏర్పాటు చేయడంతో పాటు, డ్రోన్ కెమేరాతో నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, ఏఎస్‌పి సౌమ్యలత, ఇరిగేషన్ ఎస్ఈ పి.సుధాకర్, డిటిసి మణికుమార్, గ్రౌండ్ వాటర్ డిడి దుర్గాప్రసాద్, విజయనగరం ఆర్‌డిఒ డి.కీర్తి, చీపురుపల్లి ఆర్‌డిఒ బత్తుల వెంకట సత్యవాణి, బొబ్బిలి ఆర్‌డిఒ విఎస్ఎస్ రామ్మోహన్, గనులశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆద్యకు గుర్తింపు పత్రం అందిస్తున్న పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

వరల్డ్ రికార్డులో ఫోర్టుసిటీ విద్యార్థి పేరు

విజయనగరం టౌన్ : వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డులో ఫోర్ట్ సిటీ పాఠశాలలో చదువుతున్న పొసల ఆద్య ప్రశస్థ తన పేరును నమోదు చేసుకుంది. 3 సంవత్సరాల 8 నెలలు వయసు కలిగిన ఆధ్యా ప్రశస్థ 450 ఫ్లాష్ కార్డ్సులో వున్న పదాలను, చిన్న వాక్యాలను, రైమ్స్ ను 23 నిమిషాలలో చదివి రికారు సృష్టించి రికార్డు హోల్డర్‌గా తన పేరును నమోదు చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ కెఎపి రాజు(శివ) మాట్లాడుతూ తమ పాఠశాల లో చదువుచున్న అతిచిన్న వయసు కల్గిన అధ్యాప్రశస్థ వరల్డ్ రికార్డులో తన పేరును నమోదు చేసుకోవడం గర్వకారణంగా వుందన్నారు. ఇదే విధంగా మిగిలిన విద్యార్థులు కూడా తమ ప్రతిభను కనబర్చాలన్నారు. పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్.రోయినా ఖాన్, డైరెక్టర్లు మధు, అశీక్, నీలిమా ఆధ్యాప్రశస్థను ఆమె తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు.

అట్రాసిటీ కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

విజయనగరంకోట : బొండపల్లి పోలీసు స్టేషనులో 2019 సంవత్సరంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడైన నెల్లిమర్ల మండలం ఎ.టి. అగ్రహారానికి చెందిన నారు అప్పల నాయుడు (33) పోక్సో ప్రత్యేక కోర్టు జడ్జి కె.నాగమణి 10ఏళ్ల జైలుశిక్ష, రూ.9వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పుచెప్పారు. అప్పల నాయుడు కాంపిటేటివ్ పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో బొండపల్లి మండలానికి చెందిన ఒకామెతో పరిచయం ఏర్పడి, ఆమెను పెండ్లి చేసుకుంటానని నమ్మించి, ఆమెను శారీరకంగా లోబర్చుకొని, పెండ్లికి నిరాకరించడంతో, ఆమె బొండపల్లి పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసింది. పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జడ్జి నాగమణి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా నేడు బంగార్రాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-భోగాపురం

మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా కర్రోతు బంగార్రాజు శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. విజయవాడలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని కొంతమంది మండల స్థాయి అధికారులు హాజరుకానున్నారు.

భారీ వాహనాలు రాకుండా 4 చెక్‌పోస్టులు

ట్రాఫిక్ కంట్రోల్‌కు రౌండ్ ద క్లాక్ సిస్టం : డిటిసి మణికుమార్

ప్రజాశక్తి-విజయనగరం కోట

దసరా, పైడితల్లి అమ్మవారి పండగ నేపథ్యంలో నగరంలోకి భారీ వాహనాలు రాకుండా తద్వారా ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు జిల్లాలో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డి.మణికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. జిల్లా ముఖద్వారాలైన విశాఖపట్నం నుంచి వచ్చే వాహనాల కంట్రోల్‌కు లెండి కళాశాల దగ్గర ఉన్న ప్రెస్ ఛాయిస్ దగ్గర ఒకటి, ఎస్.కోట మండలం ధర్మవరం రూట్ నుంచి వచ్చే వాహనాలకు కామాక్షి నగర్ వద్ద, శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలకు డెంకాడ దగ్గర, ఇటు పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, నుంచి వచ్చే వాహనాలకు బొండపల్లి వద్ద చెక్‌పోస్టులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఈ నాలుగింటినీ సమన్వయం చేసుకుంటూ పట్టణ పరిధిలో చెకింగ్ స్క్వాడ్ లు రెండు తిరుగుతాయని చెప్పారు. ఈ స్క్వాడ్‌లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, మరో అధికారి నిరంతరం పర్యవేక్షణ చేస్తూ రౌండ్ ద క్లాక్ సిస్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో పాటు ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఉండడానికి పోలీసుశాఖతో సమన్వయం చేసుకుంటూ తగినన్ని రికవరీ వ్యాన్లు సప్లై చేస్తున్నామన్నారు ఎక్కడా ఓవర్ లోడింగ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎక్కడా కూడా అసౌకర్యం లేకుండా తగినన్ని ఏర్పాట్లు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

10లోగా కందిపప్పు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం

కందిపప్పు కరువే అనే శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి జిల్లా పౌర సరఫరాల అధికారులు స్పందించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అక్టోబర్ నెలకు జిల్లాకు మొత్తం 260 మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించారని తెలిపారు. కందిపప్పు సరఫరా దారులకు మూమెంట్ ఆర్డర్ ఇచ్చారని పేర్కొన్నారు. సరాఫరా చేసిన కందిపప్పు జిల్లాలోని 11 ఎంఎల్ఎస్ పాయింట్‌లకు సమనంగా సరఫరా చేసి కార్డుదారులకు పంపిణీ చేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాకు కేటాయించిన కందిపప్పులో ఇంకా సరఫరా చేయాల్సిన కందిపప్పులో 61 మెట్రిక్ టన్నులు రవాణాలో ఉండగా, మిగిలిన 129 మెట్రిక్ టన్నుల కందిపప్పు కూడా ఈనెల 10లోగా కార్డుదారులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ధర్మపురి పెద్ద వీధి లో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు పాల్గొన్నారు. కనకదుర్గ అమ్మవారిని, వినాయకుడిని దర్శించుకున్నారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

పండగకు పనులు పూర్తి కావాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పైడితల్లి అమ్మవారి పండగ నాటికి అభివృద్ధి పనులు పూర్తి కావాలని కమిషనర్ పి. నల్లనయ్య అన్నారు. శుక్రవారం కామాక్షి నగర్, కాళీఘట్ కాలనీ, పావని నగర్,కేఎల్ పురం, గాజులరేగ, శ్రీనగర్, పుత్సల వీధి, మూడులాంతర్లు తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. శ్రీనగర్ లో ఉన్న పార్కు ప్రహరీ గోడ నిర్మాణాన్ని అలాగే కాంబో వీధి పార్క్ ప్రహరీ గోడ నిర్మాణాన్ని పరిశీలించారు. అలాగే మిగిలిన ప్రాంతాల్లో నిర్మితమైన డ్రైన్లు, సిసి రహదారులు, పార్కులను పరిశీలించారు.పైడితల్లి అమ్మవారి చదురు గుడి ప్రాంతంలో నిర్మితమవుతున్న సిసి డ్రైన్లను పరిశీలించి, రేపటికల్లా పనులు పూర్తి కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఇలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ఆవశ్యకతపై ప్రతి ఒక్కరిలో అవగాహన తీసుకురావాలని కార్యదర్శులకు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. శుక్రవారం విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి గృహస్థులకు సూర్యఘర్ పథకం అవసరాన్ని తెలియచేయాలని సూచించారు. దీనివల్ల భవిష్యత్తులో పర్యావరణానికి ఎంత ఉపయుక్తంగా ఉంటుందన్నది తెలియజెప్పాలన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇఇ త్రినాథరావు, డిఇఇ కిరణ్ కుమార్, టిపిఆర్ఒ సింహాచలం, సిఎంఎం సన్యాసిరావు పాల్గొన్నారు.

చేపట్టిన పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

పౌర సేవలను చేరువ చేయాలి

పనితీరును మెరుగుపరుచుకుని పౌర సేవలను మరింత చేరువ చేయాలని సచివాలయ కార్యదర్శిలకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎడ్యుకేషన్ కార్యదర్శుల తో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు సచివాలయం ద్వారా ఎన్ని ప్రజా సమస్యలు నమోదయ్యాయి, వాటిలో ఎన్నింటిని పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా ప్రజాసమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. అలాగే సచివాలయ పరిధిలో దీర్ఘకాలంగా పన్నులు కట్టలేని వారి వివరాలు సేకరించి పన్నులు కట్టే విధంగా చైతన్యం తీసుకురావాలన్నారు. వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్సులు చెల్లించే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ఎఇ సీతారామమూర్తి పాల్గొన్నారు.

లక్ష్మింపేట ప్రత్యేక న్యాయస్థానాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి రాఘవులు

లక్ష్మింపేటలో డిఎస్‌పి పర్యటన

ప్రజాశక్తి-వంగర

మండలంలోని లక్ష్మింపేటలో ప్రత్యేక న్యాయస్థానాన్ని శుక్రవారం చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు పరిశీలించారు. ఆ గ్రామంలో ఉన్న పోలీస్ అవుట్ పోస్టును తనిఖీ చేసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వంగర పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, వంగర ఎస్ఐ షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'వాగ్దేవి'లో ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలోని వాగ్దేవి విద్యాసంస్థలో ఇంటర్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, మాజీ పీజీ అండ్ ప్రొఫెషనల్ ఎగ్జామినేషన్ డీన్ కెంబూరి చంద్రమౌళి మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థి దశలోనే నైపుణ్యాలను అభివృద్ధి పరచుకొని వారి జీవితాన్ని బంగారుమయం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు ఎంతో అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు, డైరెక్టర్ సి.హెచ్ ప్రవీణ్ కుమార్, బాబు, అప్పారావు, ప్రిన్సిపల్స్ లక్ష్మణరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు

ప్రజాశక్తి-బొబ్బిలి

తిరుపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 6, 7, 8న జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ చెప్పారు. అండర్-14 విభాగంలో వరలక్ష్మి, అండర్-17 విభాగంలో డి.ఆదిత్య సోమేష్, యాదవ్, ఎస్.శివరామకృష్ణ ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటాలని క్రీడాకారులను బేబినాయన ఆకాంక్షించారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యటన

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని ఆమిటి గ్రామంలో ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు పర్యటించారు. రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. రైతులకు గోగు పంటపై సలహాలు, సూచనలు ఇచ్చారు. నార నాణ్యతను పెంచే సూచనలు చేశారు. సూక్ష్మజీవుల నిర్మాణం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు చిట్టిబాబు, స్వాతి, మండల వ్యవసాయ అధికారి జి.సునీల్, విఎఎ అల్లు సుధీర్ పాల్గొన్నారు.

విజయానందంలో యుటిఎఫ్ విజయనగరం జిల్లా జట్టు

విశాఖ జట్టుపై యుటిఎఫ్ జిల్లా జట్టు విజయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన జట్లకు ఈనెల 4న తేదీల్లో గుంటూరులో రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మొదటి రోజు క్రికెట్ పోటీలో విశాఖపట్నం జిల్లా టీమ్ పై విజయనగరం టీమ్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వాలీబాల్ పోటీలో అనంతపురం జిల్లాపై విజయనగరం టీమ్ గెలిచింది. షటిల్ సింగిల్స్ పోటీలో ఎన్‌టిఆర్ జిల్లాపై ఎం. శ్రీనివాసరావు విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ కు చేరారు. చెస్ లో జరిగిన రౌండ్ లీగ్ పోటీలో విజయనగరం జిల్లాకు చెందిన లచ్చన్న, సింహాచలం నాయుడు, మణికంఠ, పాపారావు విజయం సాధించారు. ఈ ఆటల పోటీలకు రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఆర్‌సి పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, రాష్ట్ర నాయకులు డి. రాము, కె.శ్రీనివాసరావు, జిల్లా సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందోబ్రహ్మ టీమ్‌కు అభినందనలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈనెల 22న కళాభారతి ఆడిటోరియంలో పౌరాణిక ఆధ్యాత్మిక నాటిక 'అంతర్యామి'ని అద్భుతంగా ప్రదర్శించిన ఆనందోబ్రహ్మ కళాకారుల బృందాన్ని ఎమ్మెల్యే బేబీ నాయన ఘనంగా సత్కరించారు. శుక్రవారం స్థానిక కోటలో కళాకారుల సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా కళాభారతి ఆడిటోరియంలో ప్రతినెలా తప్పకుండా పౌరాణిక సాంఘిక ప్రదర్శనలు చేయడం గొప్ప విషయమన్నారు. వెంకటేశ్వర స్వామి వైభవాన్ని చాటే విధంగా అంతర్యామి నాటికను తాను ఆద్యంతం వీక్షించి ఆనందం చెందానని తెలిపారు. ముఖ్యంగా మహిళలు ఆడపిల్లలు ఎక్కువగా ఈ ప్రదర్శనలో పాల్గొనడం మంచి పరిణామమని అన్నారు.. రాబోయే ప్రదర్శనలో మరిన్ని పౌరాణిక చారిత్రక ప్రదర్శనలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కళాభారతి ప్రధాన కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు, గెంబలి శ్రీనివాసరావు, ఆనందోబ్రహ్మ ప్రతినిధులు యం. విజయ మోహన్ రావు, బిజీ గంగాధర్, చప్ప అప్పలనాయుడు, రాముద్రి గోవిందరావు, జి.కరుణ్ కుమార్, బి.కమల్ కుమార్, కోలాటం బృందాలు, ఆనందోబ్రహ్మ డాన్స్ అకాడమీ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒలు

జిల్లా వ్యాప్తంగా ఎంపిడిఒలు, పలువురు అధికారులు, సిబ్బంది శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భారీ ఎత్తున అధికారులు, సిబ్బంది విధుల్లో చేరడంతో ఆయా కార్యాలయాల్లో సందడి నెలకొంది

బొండపల్లి ఎంపిడిఒగా గిరిబాల

బొండపల్లి : బొండపల్లి ఎంపిడిఒగా జి.గిరిబాల బాధ్యతలు చేపట్టారు. ఆమె నెలిమర్ల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎంపిడిఒ గిరిబాలకు ఎంపిపి చల్ల చలంనాయుడు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయ ఎఒగా కొండపల్లి తులసీనాథ్ బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీరాజ్ జెఇగా పొన్నాడ అప్పలనాయుడు, డిటిగా వి.రాజేశ్వరరావు, జూనియర్ సహాయకులుగా సంతోష కుమార్ బాధ్యతల్లో చేరారు.

రామభద్రాపురం ఎంపిడిఒగా రత్నం

రామభద్రపురం : రామభద్రపురం ఎంపిడిఒగా ఎం.రత్నం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన రమామణికి జియ్యమ్మవలస బదిలీ అయింది. వెలుగు ఎపిఎంగా అన్నపూర్ణ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎపిఎం రత్నప్రసాద్‌కు బాడంగి బదిలీ అయింది.

జామి ఎంపిడిఒగా అప్పలనాయుడు

జామి : జామి ఎంపిడిఒగా నీలం అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సతీష్ శృంగవరపుకోట ఎంపిడిఒగా బదిలీపై వెళ్లారు. భోగాపురంలో పనిచేస్తున్న అప్పలనాయుడు జామికి బదిలీపై వచ్చారు.

వేపాడ ఎంపిడిఒగా సూర్యనారాయణ

వేపాడ : వేపాడ ఎంపిడిఒగా సిహెచ్.సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బదిలీపై మక్కువ నుంచి మండలానికి వచ్చారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన పట్నాయక్ మెంటాడ బదిలీపై వెళ్లారు. సూపరింటెండెంట్‌గా ఎన్.మహేష్, ఎపిఎంగా డి.సూర్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్‌గా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు.

డెంకాడ ఎంపిడిఒగా భవాని

డెంకాడ : డెంకాడ ఎంపిడిఒగా వై.భవాని బాధ్యతలు స్వీకరించారు. ఆమె గంట్యాడ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ స్వరూపరాణి మక్కువ బదిలీపై వెళ్లారు. ఇఒపిఆర్‌డిగా శ్రీనివాసరావు, టైపిస్ట్‌గా ఎంఎస్ఎస్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్‌గా జ్యోతి బాధ్యతలు స్వీకరించారు. ఎపిఎంగా ఎం.శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దారుగా గాంధీ బాధ్యతలు చేపట్టారు.

సంతకవిటి ఎంపిడిఒగా సురేష్‌కుమార్

సంతకవిటి : స్థానిక మండల పరిషత్ అధికారిగా కె.సురేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో లావేరు మండలం ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జావం పంచాయతీలో పర్యటించారు.

రూ.13.95 కోట్లతో గిరిజన గ్రామాలకు రోడ్లు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రధాన మంత్రి జన జాతీయ గ్రామ్ ఉన్నత్ అభియాన్ పథకంలో భాగంగా గిరిజన గ్రామాల రోడ్ల నిర్మాణానికి రూ.13.95 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో కష్టాలను స్వయంగా చూశానని తెలిపారు. జులైలో జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని కలిసి నియోజకవర్గంలోని చిట్టెంపాడు, దారపర్తి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి అందించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి జన జాతీయ గ్రామ్ ఉన్నత్ అభియాన్ పథకం కింద జిల్లాలో తొమ్మిది గ్రామాలను కేంద్రం ఎంపిక చేసిందన్నారు. అందులో శృంగవరపుకోట మండలంలోని గూనపాడు నుంచి మెట్టపాలెం, శెనగపాడు, చిట్టెంపాడు వరకు 10.24 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.11.30 కోట్లు, వేపాడ మండలం కొండగంగుపూడి పంచాయతీకి చెందిన కెఆర్ పురం నుంచి గదబవలస వరకు 2.90 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి 2.65 కోట్ల రూపాయలు నిధులు విడుదలైనట్లు చెప్పారు. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ జిఒ 549ను విడుదల చేసినట్లు వెల్లడించారు.

7న శృంగవరపుకోటలో ప్రజాదర్బార్

ఈ నెల 7న ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాదర్బార్‌కి మండల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలన్నారు. అధికారులంతా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని సోమవారం జరిగే ప్రజాదర్బార్‌కి సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ అరుణకుమారి, టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, వేపాడ మండల ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రాజాం.. విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ అశోక్‌కుమార్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సిఐ వి.రమణమూర్తి అన్నారు. సంకల్పం కార్యక్రమాన్ని పట్టణంలోని వివేకానంద కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడకం వల్ల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్ ఫిర్యాదుల బాక్సును కాలేజీలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు భాస్కరరావు, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజాం : పట్టణంలోని పలు ప్రైవేట్ కాలేజీల్లో సంకల్పం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దని, వ్యసనాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల రవాణా గురించి తెలిస్తే వెంటనే సమాచారమివ్వాలని కోరారు. డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అనారోగ్యంతో మాజీ జెడ్‌పిటిసి బడ్డుకొండ మృతి

ప్రజాశక్తి-డెంకాడ


బడ్డుకొండ జనార్దనరావు(ఫైల్)

జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బడ్డుకొండ జనార్దనరావు (70) అనారోగ్యంతో శుక్రవారం మండలంలోని మోపాడు గ్రామంలోని తన స్వగృహంలో మృతి చెందారు. రెండు నెలల క్రితం అనారోగ్యం బారిన పడటంతో విశాఖపట్నంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఆరోగ్యం కుదుటపడడంతో ఇంటికి తీసుకొచ్చారు. ఇంటి దగ్గర ఆయన మరణించారు. తొలుత గ్రామ సర్పంచ్‌గాను, మండల వ్యవస్థ ఏర్పడిన తరువాత ఎంపిటిసిగాను ఆయన పనిచేశారు. టిడిపి తరపున జెడ్‌పిటిసిగా ఎన్నికయ్యారు. ఆయనకు ఇద్దరు కుమారులు. ఒక కుమారుడు బడ్డుకొండ రమేష్ నాయుడు గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. జనార్దనరావు భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, టిడిపి భోగాపురం, డెంకాడ మండలాల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కరరావు, నాయకులు పతివాడ తమ్మినాయుడు, తదితరులు సందర్శించి, నివాళులర్పించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన పంటలతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి కళ్యాణ మండపంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై యువ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడులు తగ్గి మంచి దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహార ధాన్యాలతో మంచి ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి చూపాలని కోరారు. కార్యక్రమంలో సుభాష్ పాలేకర్ కృషి సంస్థ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మిక కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జరజాపుపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పారిశుధ్య కార్మికుడు బి.వెంకట్ కుటుంబానికి గ్రామస్థులు ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు ఆధ్వర్యంలో యువత, గ్రామస్తులు సేకరించిన రూ.లక్ష సహాయాన్ని కుటుంబానికి అందజేశారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-తెర్లాం

తెర్లాం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు పరిశీలించి, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో శాంతిభద్రతల సమస్య, మత్తు పదార్థాలు, సమస్యాత్మక గ్రామాల గురించి ఎస్ఐ బి.సాగర్‌బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ గంజాయి దిగుమతులు, ఎగుమతులపై ప్రత్యేక దృష్టిసారించామని తెలిపారు. అందులో భాగంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఒడిశా నుంచి సాలూరు మీదుగా వస్తున్న వాహనాలను తనిఖీ చేయడానికి కొట్టక్కి వద్ద, రాయగడ, పార్వతీపురం నుంచి వచ్చిన వాహనాల తనిఖీ కోసం పాత బొబ్బిలి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. గజపతినగరం ప్రాంతంలో పిట్టాడ వద్ద మరో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రతిరోజూ డైనమిక్ వెహికల్ చెకింగ్ చేస్తున్నట్లు చెప్పారు. విద్యాసంస్థల్లో, గ్రామాల్లో గంజాయి, మత్తు పదార్థాలు, పోక్సో చట్టాలపై అవగాహన సదస్సులు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. గంజాయిలో ఒకటి లేదా రెండు సార్లు దొరికిన వ్యక్తులపై రౌడీషీట్ తెరుస్తామన్నారు. కార్యక్రమంలో సిఐ నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై సమగ్ర దర్యాప్తు

రైతుసంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి-బొబ్బిలి

సిబిఎం బాలికోన్నత పాఠశాల అక్రమ రిజిస్ట్రేషన్‌పై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వందేళ్ల చరిత్ర కలిగిన ట్రస్టుకు సంబంధించిన స్థలాన్ని ఒక వ్యక్తి పేరిట మార్చి, వేరే వారికి రిజిస్ట్రేషన్ చేయడం అన్యాయమన్నారు. రైతు భూమి రికార్డులలో తప్పు పడితే సరిచేసేందుకు ఇబ్బందులు పెట్టే రెవెన్యూ అధికారులు.. ట్రస్టు స్థలాన్ని వ్యక్తి పేరిట ఎలా మారుస్తారని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు అవినీతితోనే సిబిఎం పాఠశాల స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి అక్రమ రిజిస్ట్రేషన్‌పై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు చుక్క సన్యాసిరావు, వజ్జి రవికుమార్, సువ్వాడ అప్పారావు, కూర్మినాయుడు, గోపాలం, సత్యంనాయుడు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ విధానాన్ని పరిశీలిస్తున్న సిఐ రవికుమార్

వైన్‌షాప్ దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో మద్యం షాపులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరణకు కౌంటర్ ఏర్పాటు చేశారు. మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకునేవారు ఇక్కడ ఆన్‌లైన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అందుకోసం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌ను ఏర్పాటుచేశారు. బ్యాంకులో చెల్లించిన డిడిలను పరిశీలించేందుకు స్టేట్ బ్యాంకు కు చెందిన ఒక ఉద్యోగిని ఇక్కడ అందుబాటులో ఉంచారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన 16 మద్యం దుకాణాలతోపాటు జిల్లాలో ఎక్కడైనా, ఏ షాపుకైనా ఇక్కడ ఆన్‌లైన్ చేయనున్నట్లు సిఐ వి.పవన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

బల్లంకిలో గ్రామసభ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలో శుక్రవారం గ్రామసభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులను గుర్తించి, గ్రామసభ ద్వారా తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి గొంప తులసి, సర్పంచ్ వరలక్ష్మి, ఉప సర్పంచ్ ధనుంజయ్, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ నిర్వహిస్తున్న సిబ్బంది

వీధిదీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలని కమిషనర్ కె.అప్పలరాజు సూచించారు. శుక్రవారం రామతీర్థం జంక్షన్‌లో హైమాస్ లైట్ల అమరికను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మరమ్మతులకు గురికాకుండా చూడాలని సంబంధిత ఎఇలకు ఆదేశాలు జారీచేశారు.

మధుపాడలో రైతులకు అవగాహన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని మధుపాడలో రైతులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అవగాహన కల్పించింది. శుక్రవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త శ్రీనివాసరావురావు మాట్లాడుతూ ఎద సాగుపై రైతులకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నల్లం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు కల్పించాలి

బొబ్బిలి : మద్యం షాపుల కేటాయింపులో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్ కల్పించాలని అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సౌరు సాంబయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మద్యం షాపుల్లో 23 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. డిపాజిట్ రూ.50వేలు పెట్టి బినామీలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

ఒకే విద్యా విధానం ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఒకే దేశం.. ఒకే విద్యావిధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశ పెట్టినప్పుడే ప్రతి విద్యార్థికి న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షులు జోగినాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.పద్మ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పీటర్, ఎల్లయ్య, లక్ష్మణ రావు, శ్రీను, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రచ్చబండ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ రామన్నపాలెంలో సుమారు 2 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న రచ్చబండకు ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, సుంకరి బుల్లిబాబు, తూర్పాటి ఆదిబాబు, సత్తిబాబు రాజు, శంకర్, రమణబాబు, హరి, సత్తిబాబు, అప్పన్న పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని బోడసింగిపేట గ్రామంలో ఉన్న ప్రయివేటు పాఠశాలలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం సంచలన రేపింది. ఎస్ఐ యు.మహేష్ కథనం ప్రకారం.. బొండపల్లి గ్రామానికి చెందిన తిరుమలరాజు సూర్యనారాయణరాజు (51) విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కొద్ది రోజులుగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతోపాటు మానసిక వ్యాధులతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో పాఠశాలలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్కూల్ సిబ్బంది విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి శవాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్రంలోని కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆయన భార్య రూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజాం

మండలంలోని ఒమ్మి గ్రామానికి చెందిన చోడవరపు తిరుపతిరావు(45) గడ్డి మందు తాగి శుక్రవారం మృతి చెందాడు. గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో తిరుపతిరావు బాధ పడుతున్నాడు. మద్యం తాగటానికి కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై గడ్డి మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన మృతిచెందాడు. తిరుపతిరావుకు భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు రాజాం టౌన్ సిఐ కె.అశోక్ కుమార్ కేసు నమోదు చేశారు.

నేరాలు ఘోరాలు

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-బొబ్బిలి

అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. పారాది నుంచి గ్రోత్ సెంటర్ కు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో శుక్రవారం తెల్లవారుజామున నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ సీజ్ చేశారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యంతో వ్యాపారి అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యాపారి కళ్యాణ్ ప్రకాష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సిహెచ్ బొడ్డవలస గ్రామానికి చెందిన కళ్యాణ్ ప్రకాష్ బెల్ట్ షాపుకు మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం సాయంత్రం పట్టుకుని 28మద్యం సీసాలను సీజ్ చేసి అరెస్టు చేసినట్టు పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఫస్ట్‌ఫ్లోర్, పి.వి.ఎస్. ప్రైమ్, ఎ.జి. రోడ్, 3 లాంతర్ సెంటర్, విజయనగరం.ఫోన్ :80746 56196

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-10-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 65.50 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop ,DwarakaNagar, Visakhapatnam, నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ఫ్రూఫ్ మరియు ఐడి ఫ్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop, DwarakaNagar, Visakhapatnam, PIN – 530018, CONTACT PERSON AREA MANAGER-NAGESH, CELL NO 89192-39576

మహారాజశ్రీ బొబ్బిలి సినియర్ సివిల్ జడ్జికోర్టు బొబ్బిలి
IP 4/2024

Between :
నల్ల తిరుపతిరావు .....పిటిషనర్
And :
పూడి రమేష్ మరియు వగైరాలు ......రెస్పాండెంట్
To
R1. పూడి రమేష్, S/o రాము, R/o తెంటువలస గ్రామం, బాడంగి మండలం, విజయనగరం జిల్లా.
R2. మాదిరెడ్డి మహేష్, S/o కన్నయ్య@ కన్నంనాయుడు, R/o కుంటినవలస గ్రామం, మెంటాడ మండలం, విజయనగరం జిల్లా.
R3. నడిపల్లి గోవింద, R/o C/o బోచ్చు గణేష్, ఇట్లమామిడిపల్లి గ్రామం, రామభద్రపురం మండలం, విజయనగరం జిల్లా.
R4. కర్రి లావణ్య కుమారి, D/o నాగేశ్వరరావు, R/o Door No. 405/K-35, SP శునోయ్ బృష్టి, సపోరిజ్జ, కలకత్త, పశ్చిమబెంగాళ్.
R5. నడిమింటి చిన్నంనాయుడు, S/o సత్యం, R/o గజరాయునివలస గ్రామం, బాడంగి మండలం, విజయనగరం జిల్లా.
R6. బోచ్చు గణేష్, R/o ఇట్లమామిడిపల్లి గ్రామం, రామభద్రపురం మండలం, విజయనగరం జిల్లా.
R7. లలిత్ మోరి, S/o నందకిషోర్ మోరి, R/o Door No. 405/K-35, SP శునోయ్ బృష్టి, సపోరిజ్జ, కలకత్త, పశ్చిమబెంగాళ్.

పై నెంబరు కోర్టునందు వాది దావా/పిటిషన్ నమోదు చేయ్యగా శ్రీ కోర్టువారు వాదిని ఆర్డరు జారీ చేసిన విధంగా ఈ నోటీసు పంపించడం జరిగింది. ఈ దావా **తేది 22-10-2024 ఉదయం 10-30 ని॥**లకు మీరు గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టునకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను. లేని ఏడల శ్రీ కోర్టువారు మీకు పరోక్షంగా తీర్మానించుదురు అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

కె.రవిబాబు
అడ్వకేట్, విజయనగరం,
సెల్ : 9440343921